సాక్షి వికారాబాద్

శనివారం ׀ 28 ׀ జనవరి ׀ 2023



కనీస వేతనం ప్రకటించాలి

అంగన్‌వాడీ టీచర్లకు కనీస వేతనం రూ. 26 వేలు ప్రకటించాలని యూనియన్ జిల్లా అధ్యక్షురాలు నర్సమ్మ డిమాండ్ చేశారు. 8లో▸



బానిసలు కావొద్దు

యువకులు చెడు వ్యసనాలకు బానిస కారాదని జెడ్పీ చైర్‌పర్సన్ సునీతారెడ్డి సూచించారు. 8లో▸



అరకొర బస్సులతో అవస్థలు

కొడంగల్ మండలం రుద్రారానికి ఒక్క ట్రిప్పు మాత్రమే బస్సు నడుస్తుండటంతో విద్యార్థులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. 9లో▸

న్యూస్‌రీల్

ప్రజల మధ్య అంతరాలు అంతంకావాలి



కేవీపీఎస్ డైరీ, క్యాలెండర్‌ను ఆవిష్కరిస్తున్న డీఎస్పీ శేఖర్‌గౌడ్ తదితరులు

తాండూరు టౌన్ : సమాజం అన్ని విధాలా అభివృద్ధి చెందాలంటే ప్రజల మధ్య అంతరాలు అంతంకావాలని డీఎస్పీ శేఖర్‌గౌడ్ అన్నారు. శుక్రవారం కుల వివక్ష పోరాట సమితి (కేవీపీఎస్) ఆధ్వర్యంలో తాండూరులో నూతన సంవత్సరం డైరీ, క్యాలెండర్‌ను ఆవిష్కరించారు. ఈసందర్భంగా డీఎస్పీ మాట్లాడుతూ తరతరాలుగా సమాజంలో వస్తున్న అంతరాలు రూపుమాపి, ప్రజలంతా ఆర్థికంగా, సామాజికంగా అభివృద్ధి చెందాలన్నారు. దళిత, గిరిజన చట్టాలతో కూడిన నూతన సంవత్సర క్యాలెండర్, డైరీని కేవీపీఎస్ ఆధ్వర్యంలో రూపొందించడం అభినందనీయమన్నారు. అనంతరం కేవీపీఎస్ జిలా అధ్యక్షుడు మల్కయ్య మాట్లాడుతూ దోపిడీ లేని సమాజాన్ని, కుల వ్యవస్థను రూపుమాపడానికి కేవీపీఎస్ ఆధ్వర్యంలో సామాజిక ఉద్యమాలు నిర్వహిస్తున్నామన్నారు. కార్యక్రమంలో రూరల్ సీఐ రాంబాబు, కరన్‌కోట ఎస్‌ఐ మధుసూదన్‌రెడ్డి, నాయకులు సురేశ్, బసప్ప, రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

కులాల మధ్య చిచ్చురేపడం సరికాదు



పోలీసులకు వినతిపత్రం అందిస్తున్న ఎంఐఎం నాయకులు

కొడంగల్ రూరల్ : కులాల మధ్య చిచ్చురేపడం సరైందికాదని ఎంఐఎం నియోజకవర్గ అధ్యక్షుడు ఎస్‌బీ.గుల్షన్ పేర్కొన్నారు. శుక్రవారం పట్టణంలోని పోలీసు అధికారులకు వినతిపత్రం అందించారు. మధ్యప్రదేశ్‌లోని ఇండోర్ పట్టణంలో పఠాన్ సినిమాను ఆధారం చేసుకొని మొహమ్మద్ ప్రవక్త పేరుపై నినాదాలు చేయడం సమంజసం కాదని అన్నారు. వినతి పత్రం ఇచ్చిన వారిలో ఎండీ.సర్తజ్, హుస్సేన్, ఎండీ.అజర్, ఎండీ.సలీం, ఎండీ.అబ్బు, ఎండీ.నయీమ్ తదితరులు ఉన్నారు.

అందరూ కంటి పరీక్షలు చేయించుకోండి



కంటి పరీక్ష చేయించుకుంటున్న చైర్‌పర్సన్ మంజుల

వికారాబాద్ అర్బన్: 18 ఏళ్లు పైబడిన ప్రతి ఒక్కరూ కంటి వెలుగు పరీక్షలు చేసుకోవాలని మున్సిపల్ చైర్‌పర్సన్ మంజుల తెలిపారు. శుక్రవారం 25వ వార్డులోని బాల్‌భవన్‌లో కంటి వెలుగు కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కేసీఆర్ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా రెండో సారి కంటి వెలుగు కార్యక్రమాన్ని కొనసాగిస్తోందన్నారు. ఎందరో పేదలు కంటి సమస్యతో బాధపడుతున్నారని వారందరికీ ఇది మంచి అవకాశమన్నారు. మున్సిపాలిటీ ప్రజలు కంటి వెలుగును సద్వినియోగం చేసుకోవాలన్నారు. చైర్‌పర్సన్ కంటి పరీక్షలు చేయించుకున్నారు. మెడికల్ అధికారి సౌమ్య, మెప్మా అధికారి వెంకటేశ్ తదితరులు ఉన్నారు.

జాబ్‌మేళాకు తరలిరండి



జాబ్‌మేళా వాల్ పోస్టర్ ఆవిష్కరిస్తున్న బీఆర్ఎస్ నాయకులు

బొంరాస్‌పేట: నిరుద్యోగులందరూ జాబ్ మేళాను సద్వినియోగం చేసుకోవాలని బీఆర్ఎస్ నాయకులు సూచించారు. శనివారం జిల్లా కేంద్రంలో మెగా జాబ్‌మేళా నిర్వహిస్తున్న నేపథ్యంలో బొంరాస్‌పేట, దుద్యాల మండలాల్లో వాల్‌పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ జాబ్‌మేళాలో అన్ని రకాల ఉద్యోగ అవకాశాలున్నాయన్నారు. ప్రైవేటు, ప్రభుత్వ రంగ సంస్థల్లో ఉద్యోగ అవకాశాలను నిరుద్యోగులు అందిపుచ్చుకోవాలన్నారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ పార్టీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.



బోనాలతో తరలివచ్చిన మహిళలు

ఊరడమ్మా.. చల్లంగ చూడమ్మా

మూడేళ్లకు ఒకసారి జరిగే గ్రామ దేవత (ఊరడమ్మ జాతర) ఉత్సవాలు శుక్రవారం పెద్దేముల్ మండలం రేగోండి గ్రామంలో వైభవంగా జరిగాయి. మహిళలు బోనాలతో తరలివచ్చి అమ్మవారి ఆలయం చుట్టూ ప్రదక్షిణలు చేశారు. నైవేద్యం సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. మా గ్రామాన్ని చల్లంగా చూడాలని, పాడిపంటలు సమృద్ధిగా పండాలని అమ్మవారిని మొక్కుకున్నారు. ఈ సందర్భంగా పోతరాజుల విన్యాసాలు ఆకట్టుకున్నాయి. ఏర్పులమ్మ భవిష్యవాణి వినిపించారు. కార్యక్రమంలో గ్రామ ప్రజలతో పాటు వివిధ గ్రామాల నుంచి భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. అనంతరం భక్తులకు అన్నదానం చేశారు.

– పెద్దేముల్



పూజలందుకున్న అమ్మవారు

అవిశ్వాస సెగలు

మున్సిపాలిటీల్లో అవిశ్వాస రాజకీయాలు ఒక్కసారిగా వేడెక్కాయి. చైర్‌పర్సన్ల మార్పు అంశం మరోసారి తెరపైకి రావడమే ఇందుకుకారణం. వికారాబాద్, తాండూరు మున్సిపల్ పాలక మండళ్లు కొలువుదీరి మూడేళ్లు పూర్తయినా అధికార బదలాయింపు జరగకపోవడంతో ప్రత్యర్థి వర్గాలు గుర్రుగా ఉన్నాయి. రెండున్నర సంవత్సరాల చొప్పున అధికార చైర్ పర్సన్ పీఠాన్ని పంచుకోవాలని ఒప్పందం ఉండగా ప్రస్తుత చైర్‌పర్సన్లు కుర్చీ దిగేదేలేదంటూ భీష్మించడంతో ప్రత్యర్థి వర్గాలు అవిశ్వాసం అస్త్రాలకు పదును పెడుతున్నాయి. వికారాబాద్‌లో త్వరలో అవిశ్వాసం పెట్టేందుకు అసమ్మతి నేతలు పావులుకదుపుతున్నారు.

ఫిఫ్టీ ఫిఫ్టీ ఒప్పందంపై మళ్లీ రగడ

- మున్సిపాలిటీల్లో వేడెక్కుతున్న రాజకీయాలు
- వికారాబాద్, తాండూరు చైర్‌పర్సన్లకు అగ్నిపరీక్ష
- ప్రత్యర్థి వర్గాలకే ఎమ్మెల్యేల మద్దతు
- పదవీకాలం మూడేళ్లు ముగియడంతో ఆశావహుల్లో ఆశలు



వికారాబాద్: మున్సిపల్ చట్టం ప్రకారం మూడేళ్ల పదవీ కాలం తరువాత అవిశ్వాసం పెట్టేందుకు వీలుంది. దీంతో ప్రస్తుతం మూడేళ్లు ముగిసిన నేపథ్యంలో ఒప్పంద ఆశావహులు ఆ దిశగా పావులు కదుపుతున్నారు. ఈ రెండు మున్సిపాలిటీల్లో ఎమ్మెల్యేల మద్దతు సైతం ఆశావహుల వైపే ఉండటంతో అవిశ్వాసంపై ఊహాగానాలు జోరందుకున్నాయి. వికారాబాద్, తాండూరు మున్సిపాలిటీల్లో మెజార్టీ పాలక మండలి సభ్యులు అవిశ్వాసానికి మొగ్గు చూపుతుండటంతో అవిశ్వాసం త్వరలో ప్రవేశపెట్టనున్నట్టు తెలుస్తోంది.

పెండింగ్‌లో మున్సిపల్ బిల్లు

రాష్ట్రంలో 15 మున్సిపాలిటీల వరకు అవిశ్వాస గండాన్ని ఎదుర్కొంటున్నాయి. ఇందులో దాదాపు అన్ని మున్సిపాలిటీల్లో అధికార పార్టీకి చెందిన అభ్యర్థులే చైర్‌పర్సన్లుగా ఉండగా కొత్తగా చైర్‌పర్సన్లు కావాలనుకుంటున్న వారు సైతం ఆ పార్టీకి చెందిన వారే ఉన్నారు. ఇలా అసెంబ్లీ ఎన్నికలు సమీపిస్తున్న వేళ అవిశ్వాసాల రూపంలో మున్సిపాలిటీల్లో రచ్చ మొదలైతే పార్టీలో చిచ్చు రాజుకునే ప్రమాదముందన్న ప్రచారం జరుగుతోంది. ఈ అంశం అసెంబ్లీ ఎన్నికల ఫలితాలపై కూడా ప్రభావం చూపించే ప్రమాదం ఉంది. ఈ విషయాన్ని గ్రహించిన అధికార పార్టీ అధిష్టానం ఇప్పటి వరకు మూడేళ్లుగా ఉన్న అవిశ్వాసం గడువును నాలుగేళ్లకు పెంచుతూ ఇప్పటికే అసెంబ్లీలో బిల్లు ప్రవేశపెట్టి ఆమోదించారు. అయితే ఆ బిల్లు ప్రస్తుతం గవర్నర్ ఆమోద ముద్రకోసం పంపగా కొంతకాలంగా పెండింగ్‌లో ఉంది. ఈ నేపథ్యంలో పురపాలికల మూడేళ్ల పదవీకాలం ముగియడంతో బిల్లు ఆమోదం పొందేలోగా అవిశ్వాసం పెట్టి పీఠాలను కైవసం చేసుకోవాలని ఆశావహులు పావులు కదుపుతున్నారు. ఎమ్మెల్యేలు సైతం ఆశావహులకు మద్దతుగా ఉండటంతో ప్రస్తుత చైర్‌పర్సన్లకు అవిశ్వాసం గండం పొంచి ఉందని విశ్లేషకులు అభిప్రాయ పడుతున్నారు.

నాలిగింటిలో రెండింటికి..

జిల్లాలో నాలుగు పురపాలక సంఘాలు (తాండూరు, వికారాబాద్, పరిగి, కొడంగల్) ఉండగా ప్రస్తుతం ఈ నాలుగు మున్సిపాలిటీల్లో బీఆర్ఎస్ తరఫున గెలిచిన చైర్‌పర్సన్లే కొనసాగుతున్నారు. అయితే 2020లో జరిగిన మున్సిపల్ ఎన్నికల సమయంలోనే పరిగి, కొడంగల్ మున్సిపాలిటీల్లో చైర్మన్ అభ్యర్థులను ప్రకటించి పోటీచేయించారు. ఎలాంటి ఒప్పందాలు లేకుండా వారినే పరిగిలో ముకుంద అశోక్‌కుమార్, కొడంగల్‌లో జగదీశ్వర్‌రెడ్డిలను చైర్మన్లుగా నియమించారు. ఈ రెండు మున్సిపాలిటీల్లో ఇప్పటి వరకు ఎలాంటి ఒడిదుడుకులు లేకుండా వారే కొనసాగుతున్నారు. ఇక తాండూరు, వికారాబాద్ మున్సిపాలిటీల్లో చైర్మన్ అభ్యర్థుల మధ్య పోటీ నెలకొంది. దీంతో ప్రధానంగా చైర్‌పర్సన్ రేసులో ఉన్న ఇద్దరు అభ్యర్థులను తీసుకుని చెరో రెండున్నర ఏళ్లు పాలించాలని పార్టీ పెద్దలు ఒప్పందాలు కుదిర్చి వారికి మున్సిపల్ పీఠాలను అప్పగించారు. ఈ నేపథ్యంలో వికారాబాద్, తాండూరు మున్సిపాలిటీల్లో వైరీ వర్గం అవిశ్వానికి కాలుదువ్వుతుండటంతో ప్రస్తుత చైర్‌పర్సన్లు చిగుళ్లపల్లి మంజుల (వికారాబాద్), స్వప్నపరిమళ్ (తాండూరు)లకు అవిశ్వాస గండం తప్పేలా కనిపించడంలేదు.

ప్రభుత్వానికి వ్యతిరేకమా?



వికారాబాద్ అర్బన్: నాలుగేళ్ల వరకు అవిశ్వాసం పెట్టరాదని సీఎం కేసీఆర్ చట్టం తీసుకొచ్చారు. మున్సిపల్ శాఖ మంత్రి కేటీఆర్ అసెంబ్లీలో ప్రవేశపెట్టి ఆమోదింపజేశారు. మరి ఇప్పుడు అవిశ్వాసం పెడితే సీఎం, మంత్రి తెచ్చిన చట్టాలు ఏం కావాలి? వారి మాటకు గౌరవం లేనట్టా? అవిశ్వాసం పెట్టాలనకునే వారంతా ప్రభుత్వానికి వ్యతిరేకమా అనే విషయాన్ని స్పష్టం చేస్తే బాగుంటుంది.

– మంజుల, మున్సిపల్ చైర్‌పర్సన్, వికారాబాద్

ఎదుర్కొనేందుకు సిద్ధం



తాండూరు: మున్సిపల్ చైర్‌పర్సన్లపై అవిశ్వాసం పెట్టే విషయంలో నాలుగేళ్ల పాటు బీఆర్ఎస్ ప్రభుత్వం గడువు పెంచింది. గవర్నర్ ఆమోదం పొందలేదనే కారణంతో తమ పార్టీకి చెందిన వారే అవిశ్వాసం పెట్టేందుకు సిద్ధమవుతున్నారని చైర్‌పర్సన్ చాంబర్ దృష్టికి తీసుకెళ్లాం. ఎమ్మెల్యే రోహిత్‌రెడ్డి సైతం అవిశ్వాసం పెట్టేందుకు ప్రయత్నిస్తున్నారు. ఎలాంటి పరిస్థితి వచ్చినా ఎదుర్కొనేందుకు సిద్ధం.

– స్వప్నపరిమళ్, మున్సిపల్ చైర్‌పర్సన్, తాండూరు

చిట్యాలలో వైద్య సేవలు భేష్



ఆస్పత్రి పరిసరాలను పరిశీలిస్తున్న కేంద్ర బృందం

- ఆరోగ్య కేంద్రాన్ని సందర్శించిన కేంద్ర బృందం
- 'కాయకల్ప'కు ఎంపిక చేస్తామని హామీ

పరిగి: మండల పరిధిలోని చిట్యాల గ్రామంలో వైద్య సేవలు బాగున్నాయని కేంద్ర బృందం కితాబునిచ్చింది. శుక్రవారం చిట్యాల ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని కేంద్ర బృందం సందర్శించింది. నేషనల్ క్వాలిటీ ఇన్సురెన్స్ స్టాండర్డ్ సభ్యులు ఆరోగ్య కేంద్రం వైద్యాధికారితో మాట్లాడి అదుతున్న సేవలపై ఆరా తీశారు. ప్రభుత్వం ఏవిధమైన సేవలను అందిస్తోందని, ఆరోగ్య కేంద్రంలో ఏఏ మందులు అందుబాటులో ఉన్నాయి? వైద్యుల సమయపాలన తదితర విషయాలను అడిగి తెలుసుకున్నారు. ఆరోగ్య కేంద్రం పరిసరాలను పరిశీలించి రోగులకు మంచి వాతావరణ పరిస్థితులను అందిస్తున్నారని సిబ్బందికి కితాబునిచ్చారు. రోగులకు చికిత్సతో పాటు మంచి వాతావరణ పరిస్థితులను అందించడం ద్వారా రోగం త్వరగా నయం అవుతుందని సూచించారు. ఆరోగ్య కేంద్రంలో వైద్య సేవలు బాగున్నాయని సంతృప్తి వ్యక్తం చేశారు. చిట్యాల ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని కాయకల్ప పథకం కింద ఎంపిక చేస్తామని కేంద్ర బృందం వైద్య సిబ్బందికి హామీ ఇచ్చింది. కార్యక్రమంలో కేంద్ర బృందం సభ్యులు డాక్టర్ రాజ్‌కుమార్, కవిత, అనురాగ్, వైద్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ఉద్యమకారులకు అండగా ఉంటాం

ధారూరు: తెలంగాణ ఉద్యమకారులకు తాము ఎల్ల వేళలా అండగా ఉంటామని రాష్ట్ర బీసీ కమిషన్ సభ్యుడు శుభప్రద్‌పటేల్ హామీ ఇచ్చారు. మండల పరిధిలోని కేరెళ్లి గ్రామంలో నిర్వహించిన ఉద్యమకారుల ఆత్మీయ సమ్మేళనంలో ఆయన పాల్గొని ప్రసంగించారు. ఉద్యమకారులకు, ఉద్యమానికి కేరెళ్లి గ్రామం పుట్టినిల్లు అని, ఉద్యమ సమయంలో గ్రామ యువత పాత్ర అత్యంత కీలకమైనదని గుర్తుచేశారు. అన్ని రంగాల్లో ఉద్యమకారులకు సముచిత స్థానం కల్పించేలా తన వంతు కృషి చేస్తానని అన్నారు. అనంతరం ఉద్యమకారులు, యువకులు ఆయనకు శాలువాలు కప్పి, పూలమాలలు వేసి ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో వీడీడీఎఫ్ చైర్మన్ శ్రీనివాస్, ఉద్యమకారులు దయాకర్‌రెడ్డి, శివకుమార్‌రెడ్డి, జలంధర్‌రెడ్డి, పాషచ గోవర్ధన్‌రెడ్డి, జగదీశ్వర్, గోపాల్‌రెడ్డి, బల్వంత్‌రెడ్డి, మనోహర్‌గౌడ్, నర్సింహులు, లాలయ్య, సుజిత్, రాములు, యాదయ్య తదితరులు పాల్గొన్నారు.



ఆత్మీయ సమ్మేళనంలో మాట్లాడుతున్న బీసీ కమిషన్ సభ్యుడు శుభప్రద్‌పటేల్

బీఆర్ఎస్ దుశ్చర్యలను ఎండగట్టండి



సమావేశంలో మాట్లాడుతున్న పీసీసీ చీఫ్ రేవంత్‌రెడ్డి

- కొడంగల్‌ను దత్తత తీసుకుని ఏం చేశారు ?
- నేను చేపట్టిన అభివృద్ధే కనిపిస్తోంది
- హాత్‌సే హాత్ జోడోను విజయవంతం చేద్దాం
- పీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి

దౌల్తాబాద్: కాంగ్రెస్ శ్రేణులు కలిసికట్టుగా హాత్‌సే హాత్‌జోడో అభియాన్ యాత్రలో పాల్గొని రాష్ట్రంలో బీఆర్ఎస్ చేస్తున్న దుశ్చర్యలను ఎండగట్టాలని పీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి పిలుపునిచ్చారు. శుక్రవారం మండల కేంద్రంలో హాత్‌సే హాత్ జోడో యాత్రను ఆయన నిర్వహించారు. అనంతరం స్థానిక ఫంక్షన్ హాలులో జరిగిన కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. మంత్రి కేటీఆర్ కొడంగల్‌ను దత్తత తీసుకుని అభివృద్ధి చేస్తానని, అంతేకాకుండా కృష్ణా జలాలను తీసుకువచ్చి రైతుల కాళ్లు కడుగుతానని చెప్పి నాలుగేళ్లు గడుస్తున్నా ఆ హామీలు ఏమయ్యాయని ప్రశ్నించారు. తాను తొమ్మిదేళ్లుగా ఎమ్మెల్యేగా ఉన్నప్పుడు చేసిన పనులే గ్రామాల్లో ఇప్పటికీ కనిపిస్తున్నాయని అన్నారు. కొడంగల్ అభివృద్ధిపై చర్చకు సవాల్ విసిరారు. ప్రభుత్వం కేజీ టు పీజీ వరకు ఉచిత విద్య అన్నది ఒట్టిమాటేనని, మండలానికి జూనియర్ కాలేజీ కూడా మంజూరు చేయలేదని విమర్శించారు. స్థానిక పెద్దచెరువుకు మరమ్మతులు చేపట్టకపోవడంతో వందల ఎకరాల భూమి బీడుగా మారిందని అన్నారు. కనీసం మరమ్మతులు చేయని ప్రభుత్వం కృష్ణా జలాలు తెస్తామంటే నమ్మాలా అని ఎద్దేవా చేశారు.నారాయణపేట–కొడంగల్ ఎత్తిపోతల పథకానికి తాను రూ.1500కోట్లు మంజూరు చేయిస్తే దానిని ప్రభుత్వం అడ్డుకుందన్నారు. మీరు పడ్డ కష్టంతో సోనియాగాంధీ దయవల్ల కొడంగల్‌కు మంచి గౌరవం వచ్చిందని దీంతో తాను ఈ రోజు పీసీసీ అధ్యక్షుడిగా అయ్యానని అన్నారు. మండలంలోని ప్రతి నాయకుడు ఇంటింటికీ వెళ్లి ప్రజల సమస్యలు తెలుసుకుని హాత్‌జే హాత్‌జోడో కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని సూచించారు. కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు వెంకట్రావు, ఎంపీటీసీ మంజుల, నాయకులు వెంకట్‌రెడ్డి, సత్యపాల్, వీరన్న, వెంకట్రాములు, భీములు, రాములు, రెడ్యానాయక్, కృష్ణ తదితరులున్నారు.

1,333 ఖాళీలు

- జిల్లాలో ఉపాధ్యాయ ఖాళీల ప్రకటన
- బదిలీలు, పదోన్నతుల కోసం అంతా సిద్ధం
- నేటి నుంచి ఆన్‌లైన్‌లో దరఖాస్తుల స్వీకరణ



వికారాబాద్ అర్బన్: ఉపాధ్యాయుల బదిలీలు, పదోన్నతుల కోసం కసరత్తు పూర్తయింది. ఎన్నో ఏళ్లుగా ఎదురు చూస్తున్న ఉపాధ్యాయుల బదిలీల ఆప్షన్ ఇచ్చేందుకు సిద్ధమయ్యారు. జిల్లాలో ఎస్జీటీలతో పాటు, ఎస్ఏలు సబ్జెక్టుల వారీగా ఎన్ని ఖాళీలు ఉన్నాయనే విషయాన్ని వెబ్‌సైట్‌లో శుక్రవారం ఉంచారు. మొత్తం 1333 ఉపాధ్యాయ ఖాళీలు ఉన్నట్లు చూపారు. ఎస్జీటీలతో పాటు, స్కూల్ అసిస్టెంట్లు 8 ఏళ్ల పూర్తి చేసుకున్న వారి స్థానాన్ని ఖాళీగా చూపించారు. ఎస్జీటీ నుంచి స్కూల్ అసిస్టెంట్‌గా, స్కూల్ అసిస్టెంట్ నుంచి గెజిటెడ్ హెచ్‌ఎంగా పదోన్నతులు పొందే వారి జాబితాను కూడా సిద్ధం చేసి వెబ్‌సైట్‌లో పొందుపర్చారు. పదోన్నతులు కల్పించే విషయంలో ఎలాంటి పొరపాట్లు దొర్లకుండా సర్టిఫికెట్లను క్షుణ్ణంగా పరిశీలించారు. కటాఫ్ ఇయర్‌కు సంబంధించిన వివరాలను కూడా పొందుపార్చారు.

ఆన్‌లైన్‌లో దరఖాస్తులు..

ఉపాధ్యాయ ఖాళీల ప్రకటన పూర్తి కావడంతో శనివారం నుంచి ఈ నెల 30 వరకు ఉపాధ్యాయులు బదిలీల కోసం దరఖాస్తులు చేసుకోనున్నారు. ఫిబ్రవరి 3 వరకు అభ్యంతరాల స్వీకరణ, ఫిబ్రవరి 14న ప్రధానోపాధ్యాయులకు బదిలీ పదోన్నతులు, ఫిబ్రవరి 15 నుంచి 18 వరకు స్కూల్ అసిస్టెంట్లకు హెచ్‌ఎంలుగా పదోన్నతులు, ఫిబ్రవరి 22, 23 తేదీల్లో బదిలీలు, 25 నుంచి 27 వరకు ఎస్జీటీలకు స్కూల్ అసిస్టెంట్లుగా పదోన్నతులు, మార్చి 4న ఎస్జీటీ ఉపాధ్యాయులకు బదిలీల ప్రక్రియ చేపట్టనున్నట్లు వెబ్‌సైట్‌లో పొందు పర్చారు. మార్చి 5 నుంచి 19వరకు బదిలీ, పదోన్నతుల ప్రక్రియలో ఏదైనా పొరపాట్లు జరిగినట్లయితే ఫిర్యాదు చేసుకునేందుకు ప్రభుత్వం గడువు ఇచ్చింది.

తెలుగు మీడియంలో వివరాలిలా..

	8ఏళ్లు పూర్తి చేసుకున్న వారు	ఖాళీ ఉన్న పోస్టులు
లాంగ్వేజ్ పండిత్ హిందీ	35	10
లాంగ్వేజ్ పండిత్ తెలుగు	22	09
ఎల్ఎఫ్ఎల్ హెచ్ఎం	28	64
పీఈటీ	05	05
ఎస్ఏ బయో సైన్స్	26	61
ఎస్ఏ ఇంగ్లిష్	23	56
ఎస్ఏ హిందీ	19	07
ఎస్ఏ మ్యాథ్స్	35	20
ఎస్ఏ పీడీ	01	07
ఎస్ఏ ఫిజికల్ సైన్స్	38	10
ఎస్ఏ సోషల్	31	70
ఎస్ఏ తెలుగు	26	17
ఎస్జీటీ	453	170

తెలుగు, ఉర్దూ మీడియం కలిపి..

లోకల్ బాడీ కింద జిల్లాలో అన్నీ సబ్జెక్టులు కలిపి తెలుగు, ఉర్దూ మీడియంలో 1333 ఖాళీలు ఉన్నట్లు జిల్లా విద్యాశాఖ అధికారులు పేర్కొన్నారు. తెలుగు మీడియంలో 8 ఏళ్లు ఒకే స్కూల్‌లో పూర్తి చేసుకున్న వారు 742 మంది ఉండగా, పదవీ విరమణ, ఇతర కారణాలతో 529 ఖాళీలు ఉన్నట్లు తెలిపారు. అంటే 1271 ఖాళీలు ఉన్నట్లు పొందుపర్చారు. ఉర్దూ మీడియంలో 8 ఏళ్లు పూర్తి చేసుకున్న వారు 22 మంది ఉండగా, 40 స్థానాలు ఆయా కారణాల చేత ముందే ఖాళీగా ఉన్నాయి. ఇప్పటి వరకు ఒకే పాఠశాలలో 8ఏళ్లు పూర్తి చేసుకున్న ఉపాధ్యాయులు తప్పని సరి బదిలీ దరఖాస్తు చేసుకోవాల్సి ఉండగా, రెండు సంవత్సరాలు ఒకే పాఠశాలలో పనిచేస్తున్న వారు కూడా బదిలీకి దరఖాస్తు చేసుకోవచ్చు. తాండూరులోని మూడు ప్రభుత్వ పాఠశాలలో 73 ఉపాధ్యాయ ఖాళీలను చూపించారు. అందులో 35 మంది 8 ఏళ్లు పూర్తి చేసుకోగా, 38 ముందే ఖాళీగా ఉన్నాయి. ప్రభుత్వ బడుల్లో పనిచేసే ఉపాధ్యాయులు ఈ స్థానాలకు దరఖాస్తు చేసుకోనున్నారు.

ఉర్దూ మీడియంలో ఇలా..

	8 ఏళ్లు పూర్తి చేసుకున్న వారు	ఖాళీ ఉన్న పోస్టులు
లాంగ్వేజ్ ఉర్దూ	01	03
బయో సైన్స్	00	01
ఎస్ఏ మ్యాథ్స్	00	06
ఎస్ఏ ఫిజికల్ సైన్స్	02	04
ఎస్ఏ సోషల్	02	05
ఎస్ఏ ఉర్దూ	00	04
ఎస్జీటీ	17	34

క్లుప్తంగా

నేడు మెగా జాబ్‌మేళా

వికారాబాద్‌ అర్బన్‌: జిల్లా కేంద్రంలోని గౌలికర్‌ ఫంక్షన్‌ హాల్‌లో శనివారం నిర్వహించే మెగా జాబ్‌మేళాను నిరుద్యోగులు సద్వినియోగం చేసుకోవాలని జిల్లా యువజన క్రీడల అధికారి హన్మంత్‌ రావు శుక్రవారం ఒక ప్రకటనలో కోరారు. ఉదయం 10గంటలకు జాబ్‌ మేళా ప్రారంభమవుతుందని తెలిపారు. పదో తరగతి పాస్‌, ఫెయిల్‌, ఇంటర్‌, డిగ్రీ, ఇంజనీరింగ్‌, ఎంబీఏ, ఫార్మసీ, డ్రైవింగ్‌ అర్హతలు ఉన్నవారు, ఇతర వృతి విద్య కోర్సులు చేసిన వారు హాజరుకావాలని కోరారు. యువతి యువకులు htt pr//gormr.fe/awh1-uo5por6rrt3d6 వెబ్‌ సైట్‌లో పేర్లు నమోదు చేసుకోవాలని సూచించారు. మరిన్ని వివరాలకు సెల్‌ నంబర్‌ 6304250542, 9959903463లలో సంప్రదించాలని కోరారు.

రథసప్తమికి ఏర్పాట్లు

అనంతగిరి: వికారాబాద్‌ పట్టణానికి సమీపంలోని అనంతగిరి గుట్టపై వెలసిన అనంత పద్మనాభ స్వామి ఆలయంలో శనివారం రథసప్తమి వేడుకను పురస్కరించుకుని స్వామి వారిని సప్త వాహన సేవలు నిర్వహించనున్నట్లు ఆలయ ధర్మకర్త పద్మనాభం, ఈవో నరేందర్‌ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 7.30నుంచి సాయంత్రం 5.30 గంటల వరకు స్వామివారిని ఏడు వాహనాలపై ఊరేగించనున్నట్లు తెలిపారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని వేడుకలను విజయవంతం చేయాలని వారు కోరారు.

విద్యార్థి అదృశ్యం


విశాల్‌ (ఫైల్‌)

కుల్కచర్ల: పాఠశాలకు బయలుదేరిన విద్యార్థి అదృశ్యమైన ఘటన కుల్కచర్ల మండలంలో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. నవాబుపేట మండలం కుమ్మరిగడ్డ తండాకు చెందిన విశాల్‌(13) కుల్కచర్లలోని గిరిజన ఆశ్రమ బాలుర పాఠశాలలో 6వ తరగతి చదువుతున్నాడు. సంక్రాంతి సెలవుల అనంతరం తిరిగి పాఠశాలకు పంపేందుకు కుటుంబీకులు చౌడాపూర్‌లో ఈ నెల 20న ఆటో ఎక్కించారు. కాగా విద్యార్థి విశాల్‌ పాఠశాలకు వెళ్లలేదు. తల్లిదండ్రులకు ఫోన్‌ చేసి నేను కూడా ముంబైకి పోతానని చెప్పాడు. తల్లిదండ్రులు బాబుకు సర్దిచెప్పారు. అనుమానం వచ్చిన వారు రెండు రోజుల తర్వాత ఆశ్రమ పాఠశాలకు ఫోన్‌ చేశారు. విశాల్‌ పాఠశాలకు రాలేదని వార్డెన్‌ రాజు తెలిపారు. దీంతో శుక్ర వారం తల్లి బుజ్జిబాయి పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యా దు చేసింది. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ గిరి తెలిపారు.

జాతీయ పోటీలకు వికారాబాద్‌ యువకులు


జాతీయ పోటీల్లో పాల్గొననున్న యువకులు

అనంతగిరి: ఉత్తరప్రదేశ్‌లో జరగనున్న 39వ జాతీయ స్థాయి తైక్వాండో పోటీల్లో వికారాబాద్‌కు చెందిన యువకులు పాల్గొననున్నారు. ఇటీవల వికారాబాద్‌లో జరిగిన రాష్ట్ర స్థాయి పోటీల్లో ఉత్తమ ప్రతిభ కనబరిచిన భరత్‌, వెంకట్‌నాయక్‌, రాఘవేందర్‌, సాయిచరణ్‌, మనోహర్‌ జాతీయ పోటీల్లో పాల్గొంటున్నారని తైక్వాండో అసోసియేషన్‌ జిల్లా ప్రధాన కార్యదర్శి గోపాలకృష్ణ తెలిపారు.

ఆర్డీఓపై చర్యలు తీసుకోండి

తాండూరు: జాతీయ జెండాను తలకిందులుగా ఎగుర వేసిన ఆర్డీఓ అశోక్‌కుమార్‌పై చర్యలు తీసుకోవాలని కాంగ్రెస్‌ మున్సిపల్‌ కౌన్సిల్‌ ఫ్లోర్‌ లీడర్‌ వరాల శ్రీనివాస్‌రెడ్డి శుక్రవారం కలెక్టరేట్‌, తాండూరు పట్టణ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. జాతీయ పండగలు ప్రధానంగా రెవెన్యూ శాఖ ఆధ్వర్యంలోనే కొనసాగుతాయన్నారు. అలాంటి శాఖలో ఆర్డీఓగా విధులు నిర్వహిస్తున్న అధికారి జెండాను అవమానించారన్నారు. విధి నిర్వహణలో నిర్లక్ష్యంగా వ్యవహరించిన ఆయనపై కేసు నమోదు చేయాలని కోరారు.

కనీస వేతనం ప్రకటించాలి

అంగన్‌వాడీ టీచర్స్‌, హెల్పర్స్‌ యూనియన్‌ జిల్లా అధ్యక్షురాలు నర్సమ్మ


తాండూరు రూరల్‌: ఐసీడీఎస్‌ కార్యాలయం వద్ద ధర్నా చేస్తున్న అంగన్‌వాడీలు

పరిగి: అంగన్‌వాడీ టీచర్లకు కనీస వేతనం రూ. 26 వేలు ప్రకటించాలని ఆ యూనియన్‌ జిల్లా అధ్యక్షురాలు నర్సమ్మ కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్‌ చేశారు. శుక్రవారం పట్టణంలోని ఐసీడీఎస్‌ కార్యాలయం వద్ద అంగన్‌వాడీల సమస్యలను పరిష్కరించాలని డిమాండ్‌ చేస్తూ సీఐటీయూ ఆధ్వర్యంలో నిరసన వ్యక్తం చేశారు. అనంతరం ఆమె మాట్లాడుతూ.. రాష్ట్రంలో 40 సంవత్సరాలుగా అంగన్‌వాడీ టీచర్లు విధులు నిర్వహిస్తున్నా వారికి ఉద్యోగ భద్రత లేకుండా పోయిందన్నారు. కనీస వేతనం ప్రకటించి, ఉద్యోగ భద్రత కల్పించాలని కోరారు. అంతేకాకుండా బీఎల్‌ఓ డ్యూటీల పేర్లతో అధికారులు వేధిస్తూ మెమోలను జారీ చేయడం సరికాదన్నారు. వేధింపులకు గురిచేస్తున్న అధికారులపై ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని డిమాండ్‌ చేశారు. కార్మికులకు పెండింగ్‌ జీతాలను చెల్లించి ప్రతి ఒక్కరికీ రూ.10 లక్షల బీమా సౌకర్యం, పెన్షన్‌ సౌకర్యం, రిటైర్మెంట్‌ బెనిఫిట్స్‌ ఇవ్వాలని కోరారు. సుప్రీం కోర్టు తీర్పు మేరకు సమాన పనికి సమాన వేతనం అమలు చేయాలని కోరారు. కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా కార్యదర్శి రామకృష్ణ, ఉపాధ్యక్షుడు చంద్రయ్య, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలి

తాండూరు రూరల్‌: అంగన్‌వాడీలను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు శ్రీనివాస్‌ డిమాండ్‌ చేశారు. శుక్రవారం ఐసీడీఎస్‌ కార్యాలయం వద్ద అంగన్‌వాడీ టీచర్లు, ఆయాలతో కలిసి ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సమాన పనికి సమాన వేతనం చెల్లించాలని కోరారు. అంగన్‌వాడీలపై అధికారులు వేధింపులను అరికట్టాలని డిమాండ్‌ చేశారు. వికారాబాద్‌ తహసీల్దార్‌ అంగన్‌వాడీలను బీఎల్‌ఓ డ్యూటీ పేరుతో వేధిస్తున్నారని ఆరోపించారు. మార్చి నెలలో మూడు రోజుల పాటు సమ్మె చేస్తామని నోటీసు అందజేశారు. కార్యక్రమంలో నాయకులు బుగ్గప్ప, శోభన, వసంత, వాణి, లక్ష్మి, శశికళ, సుజాత, రాజేశ్వరి పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించాలి

అనంతగిరి: అంగన్‌వాడీ టీచర్లు ఎదుర్కొంటున్న సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని అంగన్‌వాడీ టీచర్స్‌, హెల్పర్స్‌ యూనియన్‌ జిల్లా అధ్యక్షురాలు భారతి డిమాండ్‌ చేశారు. శుక్రవారం రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు వికారాబాద్‌లోని సీడీపీఓ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. పెండింగ్‌లో ఉన్న వేతనాలను వెంటనే విడుదల చేయాలన్నారు. ప్రమాద బీమా రూ.10లక్షలు ఇవ్వాలన్నారు. పెన్షన్‌ సౌకర్యం కల్పించాలన్నారు. సీనియార్టీ ఉన్న వారికి ప్రమోషన్లు ఇవ్వాలని కోరారు. కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు మహిపాల్‌, అంగన్‌వాడీ యూనియన్‌ నాయకులు ప్రమీల, లక్ష్మి, ఇందిరా, లక్ష్మి, భాగలక్ష్మి, అండాలు, సుజాత, నాగమణి, శకుంతల, రాములమ్మ రేణుక, సంగీత, జ్యోతి, అరుణ, కవిత, మనోహర, వెంకటమ్మ, ఫాతిమా, రెహానా, పద్మ, స్వరూప, స్వప్న, అన్నపూర్ణ తదితరులు పాల్గొన్నారు.

ఉనికి కోసమే చిల్లర రాజకీయాలు

రేవంత్‌పై ఎమ్మెల్యే నరేందర్‌రెడ్డి ఫైర్‌

కొడంగల్‌ రూరల్‌: ఉనికి చాటుకోవడానికి పీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి చేస్తున్న చిల్లర రాజకీయాలు మానుకోవాలని ఎమ్మెల్యే పట్నం నరేందర్‌రెడ్డి హితవు పలికారు. శుక్రవారం పట్టణంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఆయన మాట్లాడారు. రేవంత్‌రెడ్డి తొమ్మిదేళ్లు అధికారంలో ఉన్నప్పుడు ఈ ప్రాంతాన్ని ఏ మేరకు అభివృద్ధి చేశాడో చెప్పాలని డిమాండ్‌ చేశారు. టీఆర్‌ఎస్‌ ప్రభుత్వ హయాంలో జరిగిన అభివృద్ధిని కంటి వెలుగు పథకం అద్దాలు పెట్టుకొని చూడాలన్నారు. రేవంత్‌రెడ్డిని నియోజకవర్గ ప్రజలు నమ్మి మోసపోయే పరిస్థితిలో లేరన్నారు. వచ్చే ఎన్నికల్లో ఎమ్మెల్యే టికెట్లు అమ్ముకోవడానికి పీసీసీ పదవిని తెచ్చుకున్నాడని ఆరోపించారు. గతంలో పలుమార్లు అభివృద్ధిపై చర్చకు రావాలని ప్రకటించినా స్పందించలేదన్నారు. కొడంగల్‌ నుంచి మళ్లీ పోటీ చేస్తే ప్రజలే బుద్ధి చెబుతారని పేర్కొన్నారు. ఏ నియోజకవర్గంలో నిలబడతావో నీకే నమ్మకం లేకుండా పోయిందని, ప్రజలకు దానిపై క్లారిటీ ఇవ్వాలన్నారు. సీఎం కేసీఆర్‌, మంత్రి కేటీఆర్‌లపై అనుచిత వ్యాఖ్యలు చేయడం సరైందికాదని హితవు పలికారు. మాజీ ఎమ్మెల్యే గురునాథ్‌రెడ్డి మా ఫ్యామిలీ సభ్యుడని, లాంటివారిని మర్యాద పూర్వకంగా రేవంత్‌రెడ్డి కలిసి ఉండొచ్చని అన్నారు. సీఎం కేసీఆర్‌ అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను గతంలో ఏ ప్రభుత్వాలు ప్రవేశ పెట్టలేదని పేర్కొన్నారు. కార్యక్రమంలో కౌన్సిలర్‌ మధుసూదన్‌ యాదవ్‌, నాయకులు విష్ణువర్ధన్‌రెడ్డి, మొఖ్తార్‌, సర్పంచుల సంఘం అధ్యక్షుడు చాంద్‌పాషా, దౌల్తాబాద్‌ జెడ్పీటీసీ మహిపాల్‌, ఎంపీపీ విజయ్‌ కుమార్‌, మాజీ జెడ్పీటీసీ మోహన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే పట్నం నరేందర్‌రెడ్డి

ఈపీఎఫ్‌ నమోదు చేసుకోవాలి


ఈపీఎఫ్‌పై ఉద్యోగులకు అవగాహన కల్పిస్తున్న అధికారులు

వికారాబాద్‌ అర్బన్‌: మున్సిపల్‌ ఉద్యోగులు, కార్మికులు విధిగా ఈపీఎఫ్‌ నమోదు చేసుకోవాలని సహాయక భవిష్యనిధి కమిషనర్‌ రామ సుబ్బయ్య సూచించారు. శుక్రవారం మున్సిపల్‌ కార్యాలయంలో కమిషనర్‌ శరత్‌చంద్ర అధ్యక్షతన ఈపీఎఫ్‌పై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఈపీఎఫ్‌ నమోదు చేసుకున్న మొదటి నెల నుంచే ప్రమాద బీమా వర్తిస్తుందన్నారు. ప్రతి నెలా సభ్యుల ప్రాథమిక వేతనం, కరువు భత్యం కింద యాజమాన్యం, కార్మికుల పరస్పర అంగీకారంతో 12శాతం సంస్థలకు జమ చేయాల్సి ఉంటుందన్నారు. ఉద్యోగి విధి నిర్వహణలో మరణిస్తే అతని నామినీ లేక చట్టపరమైన వారసుడికి గరిష్టంగా రూ. 7లక్షలు చెల్లిస్తుందన్నారు. పింఛను కూడా అందజేయడం జరుగుతుందన్నారు. అవసరమైన సమయాల్లో గృహ నిర్మాణం కోసం, ఇంటి స్థలం కొనుగోలుకు, కొత్త ఇల్లు కొనేందుకు, పిల్లల చదువు కోసం, ఆరోగ్య వ్యవహారాల కోసం రుణాలు పొందవచ్చునని తెలిపారు. సభ్యుడు సర్వీసులో ఉండగా మరణిస్తే ఇద్దరు పిల్లలకు 25 ఏళ్ల వయస్సు వచ్చే వరకు పింఛన్‌ అందుతుందన్నారు. ఉద్యోగుల పింఛన్‌ పథకం కింద కాంట్రిబ్యూషన్‌ సభ్యుని జీతం నుంచి కాకుండా యజమాని, ప్రభుత్వం ద్వారా చెల్లించడం జరుగుతుందన్నారు. కుటుంబీకుల భవిష్యత్‌ ప్రయోజనాలను దృష్టిలో పెట్టుకొని ప్రతి ఉద్యోగి, కార్మికుడు ఈపీఎఫ్‌ నమోదు చేసుకోవాలని సూచించారు.

వ్యసనాలకు బానిసలు కావొద్దు

- జెడ్పీ చైర్‌పర్సన్‌ సునితారెడ్డి
- ధారూరులో క్రికెట్‌ టోర్నీ ప్రారంభం


పదో తరగతిలో ఉత్తీర్ణత సాధిస్తామని జెడ్పీ చైర్‌పర్సన్‌కు ప్రామిస్‌ చేస్తున్న విద్యార్థులు

ధారూరు: యువకులు చెడు వ్యసనాలకు బానిసలు కారాదని జెడ్పీ చైర్‌పర్సన్‌ సునితారెడ్డి సూచించారు. కేసీఆర్‌ జన్మదినం సందర్భంగా వడ్లనందు ఫౌండేషన్‌ ఆధ్వర్యంలో ధారూరులో నిర్వహిస్తున్న క్రికెట్‌ టోర్నమెంట్‌ను శుక్రవారం ఆమె శుక్రవారం ప్రారంభించారు. అనంతరం చైర్‌పర్సన్‌ మాట్లాడుతూ.. అవకాశం వచ్చిన ఏ రంగంలోనైనా యువత రాణించాలని, తక్కువ జీతం అనే భావన వీడాలని సూచించారు. నచ్చిన రంగాన్ని ఎంచుకొని అందులో ఎదుగుదల సాధించాలన్నారు. సెల్‌ఫోన్‌ వల్ల యువతలో సోమరితనం పెరిగిపోతోందిని పేర్కొన్నారు. విద్యార్థులు చదువుతో పాటు క్రీడలనూ మరచి పోరాదని సూచించారు. సన్మార్గంలో నడిచే యువతకు తమ సహకారం ఉంటుందని ఆమె హామీ ఇచ్చారు. అనంతరం వాలీబాల్‌ అసోసియేషన్‌ జిల్లా అధ్యక్షుడు జె హన్మంత్‌రెడ్డి మాట్లాడుతూ.. ఆటలతో ఆరోగ్యంతో పాటు పోటీతత్వం పెరుగుతుందని తెలిపారు. గ్రామీణ యువకుల్లో క్రీడా నైపుణ్యం వెలికితీయడానికి ఇలాంటి వేదికలు దోహద పడతాయన్నారు.

'కంటి వెలుగు' పరిశీలన

క్రికెట్‌ పోటీలను ప్రారంభించిన అనంతరం జెడ్పీ చైర్‌పర్సన్‌ సునితారెడ్డి ధారూరులో కొనసాగుతున్న కంటి వెలుగు కార్యక్రమాన్ని పరిశీలించారు. వైద్యులతో మాట్లాడి ప్రజలకు చేస్తున్న కంటి పరీక్షలపై ఆరా తీశారు. అనంతరం పక్కనే ఉన్న బాలికల ఉన్నత పాఠశాలకు వెళ్లి విద్యార్థులతో కలసి మధ్యాహ్న భోజనం చేశారు. పదో తరగతి విద్యార్థులతో మాట్లాడి చదువు ఎలా సాగుతుందోనని తెలుసుకున్నారు. తామంతా మంచి మార్కులతో పాస్‌ అవుతామని జెడ్పీ చైర్‌పర్సన్‌కు పదో తరగతి విద్యార్థులు ప్రామిస్‌ చేశారు. బీఆర్‌ఎస్‌ యువజన విభాగం జిల్లా నాయకుడు నందు, జిల్లా పరిషత్‌ కోఆప్షన్‌ సభ్యుడు అజీమ్‌, వైస్‌ ఎంపీపీ విజయకుమార్‌, సర్పంచులు పాండు నాయక్‌, చంద్రమౌళి, ఎంపీటీసీల ఫోరం మండల అధ్యక్షుడు పి.మున్నూరు, సోమారం ఎంపీటీసీ రవి, బసప్ప, బీఆర్‌ఎస్‌ నాయకులు హఫీజ్‌, ఇబ్రహీం పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికే 'మీతో నేను'


సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే డాక్టర్‌ మెతుకు ఆనంద్‌

ఎమ్మెల్యే డాక్టర్‌ మెతుకు ఆనంద్‌

మర్పల్లి: గ్రామాల్లో నెలకొన్న ప్రజా సమస్యల పరిష్కారానికే మీతో నేను కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు ఎమ్మెల్యే డాక్టర్‌ మెతుకు ఆనంద్‌ తెలిపారు. శుక్రవారం మండలంలోని తిమ్మాపూర్‌లో ఎంపీపీ బట్టు లలిత, జెడ్పీటీసీ మధుకర్‌, అధికారులతో కలిసి మీతో నేను కార్యక్రమాన్ని నిర్వహించారు. ముందుగా పలు కాలనీల్లో తిరుగుతూ ప్రజలతో మాట్లాడి సమస్యలు తెలుసుకున్నారు. అనంతరం సర్పంచ్‌ మైసగల్ల మల్లయ్య అధ్యక్షతన ఏర్పాటు చేసిన సమావేశంలో ఎమ్మెల్యే మాట్లాడారు. పల్లె ప్రగతి కార్యక్రమంలో భాగంగా గ్రామంలో మిషన్‌ భగీరథ తాగునీటి పైప్‌ లైన్‌, అండర్‌ గ్రౌండ్‌ డ్రైనేజీ, సీసీ రోడ్లు, స్వచ్ఛ భారత్‌లో భాగంగా ప్రతి ఇంటికీ వ్యక్తి గత మరుగుదొడ్లు వంటి పనులను 80 శాతం మేరకు పూర్తి చేసినట్లు చెప్పారు. సర్పంచ్‌ మల్లయ్య పనితీరు బాగుందని ఎమ్మెల్యే కితాబు ఇచ్చారు. పల్లె ప్రకృతి వనం, వైకుంఠధామం, కాంపోస్ట్‌ షెడ్‌ వంటి పనులను సైతం చేపట్టామన్నారు. గ్రామంలో దెబ్బతిన్న విద్యుత్‌ స్తంభాలను, పాడుబడిన ఇళ్లు, బావులను తొలగించాలని ఎమ్మెల్యే ఆదేశించారు. గ్రామంలో మరుగుదొడ్లు లేనివారికి వెంటనే మంజూరు చేయాలని ఎంపీడీఓ మహేష్‌కుమార్‌కు సూచించాడు. అర్హులైన వారు పింఛన్ల కోసం దరఖాస్తు చేసుకోవాలన్నారు. సాగు భూమి విస్తీర్ణాన్ని అంచనా వేసి సిరిపురం, వీర్లపల్లి గ్రామాలకు మాత్రమే ఓ క్లస్టర్‌గా ఏర్పాటు చేయాలని వ్యవసాయ శాఖ జిల్లా అధికారులకు సూచించారు. గ్రామంలోని 2, 3వార్డుల్లో గల ప్రతి ఇంటికీ మిషన్‌ భగీరథ నల్లా కనెక్షన్‌ ఇవ్వాలని ఆదేశించారు. ఉపాధి హామీ కూలీలకు బకాయి డబ్బులు చెల్లించాలని ఎమ్మెల్యే సంబంధిత అధికారులకు సూచించారు. గ్రామ సమస్యల పరిష్కారానికి ఎమ్మెల్యే కోటా కింద రూ. 10లక్షలు మంజూరు చేస్తున్నట్లు ప్రకటించారు. కార్యక్రమంలో తహసీల్దార్‌ శ్రీధర్‌, వైస్‌ ఎంపీపీ మోహన్‌రెడ్డి, సర్పంచ్‌ల ఫోరం మండల అధ్యక్షుడు శ్రీనివాస్‌, రావులపల్లి ఎంపీటీసీ రవి, పంచాయతీ కార్యదర్శి నాగయ్య, ఈసీ విఠల్‌, ఏపీఓ అంజిరెడ్డి, ఏపీఎం పోచయ్య, సిరిపురం వెటర్నరీ డాక్టర్‌ నరేంద్రనాథ్‌రెడ్డి, టీఆర్‌ఎస్‌ మండల అధ్యక్షుడు శ్రీకాంత్‌ రెడ్డి, ప్రధాన కార్యదర్శి రాచన్న, ఉపాధ్యక్షులు అశోక్‌, రమేష్‌ మిత్ర, సహకార సంఘం డైరక్టర్‌ యాదయ్య, మార్కెట్‌ డైరక్టర్‌ గౌస్‌ పాల్గొన్నారు.

రేషన్‌ బియ్యం పట్టివేత

పరిగి: అక్రమంగా తరలిస్తున్న రేషన్‌ బియ్యాన్ని స్వాధీనం చేసుకొని కేసు నమోదు చేసిన సంఘటన శుక్రవారం చోటు చేసుకుంది. ఎస్సై విఠల్‌రెడ్డి కథనం మేరకు.. చిగురాల్‌పల్లి నుంచి 10 క్వింటాళ్ల బియ్యాన్ని వ్యాన్‌లో అక్రమంగా తరలిస్తుండగా పోలీసులు పట్టుకున్నారు. బియ్యాన్ని స్టేషన్‌కు తరలించి డ్రైవర్‌ రామ్‌సింగ్‌పై కేసు నమోదు చేసినట్టు పోలీసులు తెలిపారు.

వ్యక్తి ఆత్మహత్య



పెద్దేముల్‌: తాగుడుకు బానిసైన వ్యక్తి ఇంట్లో ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్న సంఘటన శుక్రవారం పెద్దేముల్‌ పోలీస్‌స్టేషన్‌ పరిధిలో చోటుచేసుకుంది. ఎస్‌ఐ అబ్దుల్‌రవూఫ్‌ కథనం మేరకు.. మంబాపూర్‌కు చెందిన రాములు కుతురు శ్రీలతను రెండేళ్ల క్రితం బంట్వారం మండల సల్బాత్తాపూర్‌కు చెందిన నాగభూషణం(34)కి ఇచ్చి వివాహం చేశారు. వీరికి ఒక కుమారుడు ఉన్నాడు. తాగుడుకు బానిసైన నాగభూషణం శుక్రవారం ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఆత్మహత్య చేసుకున్నాడు. పొలం నుంచి వచ్చిన కుటుంబ సభ్యులు నాగభూషణం ఆత్మహత్య చేసుకున్న విషయం తెలుసుకొని పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

దైవభక్తి అలవర్చుకోవాలి

ఎమ్మెల్యే రోహిత్‌రెడ్డి


గదతో ఎమ్మెల్యే రోహిత్‌రెడ్డి

బంట్వారం: ప్రతి ఒక్కరూ దైవ భక్తిని అలవర్చుకుని సన్మార్గంలో నడవాలని ఎమ్మెల్యే పైలెట్‌ రోహిత్‌రెడ్డి అన్నారు. శుక్రవారం కోట్‌పల్లి మండలం ఇందోల్‌ గ్రామంలో పోచమ్మ నాగుల విగ్రహ ప్రతిష్ఠాపనకు హాజరయ్యారు. ఈ సందర్భంగా కార్యక్రమ నిర్వాహకులు తూర్పు లింగారెడ్డి ఎమ్మెల్యేను గజమాలతో సత్కరించి హనుమాన్‌ గదను బహూకరించారు. అనంతరం రోహిత్‌రెడ్డి మాట్లాడుతూ యువత చెడు అలవాట్లకు దూరంగా ఉండాలన్నారు. దైవ చింతనతో మానసిక ప్రశాంతత లభిస్తుందన్నారు. అంతకుముందు ఆయా గ్రామాల్లో పర్యటించిన ఎమ్మెల్యే పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేశారు. టీఆర్‌ఎస్‌ కోట్‌పల్లి మండల అధ్యక్షుడు సుందరి అనిల్‌, వర్కింగ్‌ ప్రెసిడెంట్‌ రాములు, ఏఎంసీ చైర్మన్‌ మహేందర్‌, పీఏసీఎస్‌ చైర్మన్‌ రాంచంద్రారెడ్డి, వైస్‌ చైర్మన్‌ సుధాకర్‌గౌడ్‌, మత్స్య సహకార సంఘం అధ్యక్షుడు ఆనంద్‌, సర్పంచ్‌ల సంఘం మండల అధ్యక్షుడు వెంకటేష్‌ యాదవ్‌, సర్పంచులు రాంచందర్‌, శోభారాణి, ఎంపీటీసీ అంబిక పాల్గొన్నారు.

కాంగ్రెస్‌ ఎస్టీ సెల్‌ కార్యదర్శిగా జయరాం


జయరామ్‌కు నియామకపత్రం అందజేస్తున్న రామ్మోహన్‌రెడ్డి

పరిగి: కాంగ్రెస్‌ పార్టీ ఎస్టీ సెల్‌ జిల్లా కార్యదర్శిగా దోమ మండలం బుద్లాపూర్‌కు చెందిన జరుపుల జయరాంను నియమిస్తూ శుక్రవారం డీసీసీ అధ్యక్షుడు టీ రామ్మోహన్‌రెడ్డి తన నివాసంలో నియామకపత్రం అందజేశారు. అనంతరం డీసీసీ అధ్యక్షుడు మాట్లాడుతూ.. పార్టీ బలోపేతానికి ప్రతి కార్యకర్తా చేయాలని సూచించారు. పార్టీ కోసం పని చేసిన వారికి తప్పక గుర్తింపు వస్తుందన్నారు. నిత్యం ప్రజల మధ్య ఉండి వారి సమస్యలపై పోరాటం చేయాలని సూచించారు. కార్యక్రమంలో పార్టీ పరిగి మండల అధ్యక్షుడు పరశురాంరెడ్డి, నాయకులు రామకృష్ణరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నారు ముదురుతోంది

- కూలీలు దొరక్క రైతుల అవస్థలు
- ఎకరా నాటుకు రూ. 2వేలు అదనం
- సబ్సిడీ యంత్రాలు ఇవ్వాలని వినతి


నాట్లు వేస్తున్న కూలీలు

దౌల్తాబాద్‌: యాసంగి వరినాట్లు వేసేందుకు కూలీలు దొరక్క మండల రైతులు అవస్థలు పడుతున్నారు. పోసిన నారు ముదిరిపోతుండడంతో ఆందోళన చెందుతున్నారు. వానాకాలంలో భారీ వర్షాలు పడడంతో చెరువులు, కుంటలు నిండి భూగర్భ జలాలు పెరిగాయి. దీంతో యాసంగిలో పంటలకు నీటి ఇబ్బందులు ఉండవని రైతులు భావించారు. అనుకున్నట్లే ఎక్కువ విస్తీర్ణంలో వరిసాగుకు ఏర్పాట్లు చేసుకున్నారు. తీరా నాట్లు వేసే సమయానికి సరిపడా కూలీలు దొరక్క ఏం చేయాలో దిక్కుతోచని పరిస్థితిలో ఉన్నారు. మండలంలో యాసంగిలో 6వేల ఎకరాల్లో వరిసాగు అవుతుందని అంచనా. ప్రస్తుతం 400 ఎకరాల్లో నాట్లు వేసినట్లు తెలిసింది. కూలీల కొరతతో వరినారు ముదిరిపోతున్నాయి. 20 రోజుల నుంచి 40 రోజుల్లోపు నాటు వేసుకోవాలి. కానీ రెండు నెలలు దాటుతున్నా నాట్లు వేయని పరిస్థితి నెలకొంది. ముదిరిన నారు వేస్తే దిగుబడిపై ప్రభావం పడే ప్రమాదం ఉంది. రైతులు పోటీపడి కూలీలకు ఎక్కువ ఇస్తామంటూ ఆశ చూపిస్తున్నారు. దీంతో రేటు రోజురోజుకూ మరింత పెరుగుతోంది. మండలంలో వందల మంది రైతులు ప్రతి రోజూ నాట్లు వేసే కూలీల కోసం తిరుగుతున్నా ఫలితం కనిపించడం లేదు. గతేడాది వరకు ఎకరం నాటు వేసేందుకు కూలీలకు రూ. 6 వేలలోపు ఖర్చు అయ్యేది. ఈ ఏడాది యాసంగి కూలీలకు డిమాండ్‌ పెరగడంతో ఎకరానికి రూ. 8వేల వరకు ఖర్చు చేయాల్సి వస్తోంది. కూలీల కొరత నేపథ్యంలో గ్రామాల్లో 10నుంచి 20 మంది మహిళలు జట్టుగా ఏర్పడి గుత్తకు ఎకరం రూ. 7వేల నుంచి రూ. 8వేల వరకు నాట్లు వేస్తున్నారు. అలాగే వారి రవాణాకు ఆటో ఖర్చు రైతే భరించాల్సి వస్తోంది.

కూలీల కొరత ఉంది



నాటు వేసే యంత్రాలు వస్తే తప్పా భవిష్యత్తులో వ్యవసాయం చేయడం కష్టం. ఇప్పుడు నాట్లు వేసేందుకు కూలీలు దొరకడం లేదు. గిట్లయితే ఎవుసం ఎట్లా. ప్రభుత్వం రైతులకు నాట్లేసే యంత్రాలను సబ్సిడీపై ఇవ్వాలి. – రమేష్‌, రైతు, దౌల్తాబాద్‌

శ్రీరాముడి ఆలయానికి స్థల విరాళం

రూ. 10లక్షల విలువ చేసే భూమి పత్రాలు అందజేసిన ఎంపీపీ దంపతులు

ధారూరు: మండలంలోని నాగారం గ్రామంలో వెలసిన శ్రీరాముని ఆలయానికి రూ. 10లక్షల విలువ చేసే స్థలాన్ని శుక్రవారం ఎంపీపీ జే విజయలక్ష్మి దంపతులు విరాళంగా అందజేశారు. గ్రామంలోని శ్రీరామ మందిర ప్రాంగణానికి తన వంతుగా 1,800 గజాల స్థలాన్ని రిజిస్ట్రేషన్‌ చేయించి అందుకు సంబంధించిన పత్రాలను ఆలయ కమిటీ నిర్వాహకులు వీరేందర్‌రెడ్డి, గోవర్ధన్‌రెడ్డి, యాదయ్య ఇచ్చారు. వాలీబాల్‌ అసోసియేషన్‌ జిల్లా అధ్యక్షుడు హన్మంత్‌ రెడి పత్రాలను అందజేశారు. స్థల దాతలకు ఆలయ కమిటీ నిర్వాహకులు కృతజ్ఞతలు తెలిపారు.

వివాహ వేడుకకు ఎమ్మెల్సీ హాజరు


నూతన వధూవరులతో ఎమ్మెల్సీ పట్నం మహేందర్‌రెడ్డి తదితరులు

తాండూరు రూరల్‌: మండలంలోని కోటబాసుపల్లి సర్పంచ్‌ కుర్వ నాగార్జున సోదరుడు మహేష్‌ వివాహం పట్టణంలోని వీరశైవ ఫంక్షన్‌ హాల్‌లో శుక్రవారం జరిగింది. ఎమ్మెల్సీ పట్నం మహేందర్‌ రెడ్డి వివాహ వేడుకకు హాజరై నూతన వధూవరులను ఆశీర్వదించారు. టీ పీసీసీ ఉపాధ్యక్షుడు రమేష్‌ మహరాజ్‌, వివిధ పార్టీల నాయకులు, అధికారులు వీరేందర్‌రెడ్డి, సురేందర్‌రెడ్డి, వెంకట్రాం రెడ్డి, మొగులప్ప, సురేష్‌ తదితరులు వివాహానికి హాజరయ్యారు.